www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 సెప్టెంబరు 2023
5
ఏలూరు

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష

ఏలూరు:గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి ఏలూరు జిల్లాకు డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన జి.భానుశ్రీలక్ష్మిఅన్నపూర్ణప్రత్యూష కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసి పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే అందరి మెప్పు పొందాలన్నారు. పరీక్షల్లో ఏ విధంగా పోటీపడి ఉద్యోగం పొందారో అదేవిధంగా విధి నిర్వహణలో పోటీ పడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఉన్నతాధికారులు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ప్రత్యూషకు సూచించారు. విధి నిర్వహణలో ఏలాంటి అలసత్వానికి తావివ్వకూడదన్నారు.

పోస్టు ఇచ్చారు.. జీతం మరిచారు..!

రెండో ఎంఇఒల పరిస్థితి అగమ్యగోచరం
నాలుగు నెలలుగా అందని జీతాలు
ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు సతమతం
ఉమ్మడి జిల్లాలో 47 మంది రెండో ఎంఇఒలు
అక్టోబర్‌లోనైనా జీతాలందేనా..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రెండో ఎంఇఒలను ఆర్భాటంగా ప్రభుత్వం నియమించింది. కానీ వారికి జీతాలు ఇవ్వడం మాత్రం పూర్తిగా మరిచారు. గడిచిన నాలుగునెలలుగా జీతాలందక ఎంఇఒ-2 ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యావ్యవస్థ మార్పుల్లో భాగంగా ప్రతిమండలానికి రెండో ఎంఇఒను ప్రభుత్వం నియమించింది. మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఈ పోస్టుల్లో నియమించింది. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించగా, నియమించిన ఎంఇఒ-2లకు అకాడమిక్ బాధ్యతలు అప్పగించారు. స్కూళ్లకు సంబంధించి అకాడమిక్ మోనటరింగ్, ఉపాధ్యాయులకు శిక్షణాతరగతులు వంటి పనులను రెండో ఎంఇఒలు చూస్తున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉంది. పోస్టులో చేరిన వీరికి ఇప్పటి వరకూ ప్రభుత్వం జీతాలివ్వలేదు. ఏలూరు జిల్లాలో 27 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మంది మండలానికి ఒకరు చొప్పున మొత్తం 47 మంది రెండో ఎంఇఒలు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన వీరంతా బాధ్యతలు చేపట్టారు. దాదాపు నాలుగు నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ జీతాలు అనేవి ఇవ్వలేదు. వీరంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే. నెలకు రూ.లక్ష, ఆపైన వరకూ జీతాలు అందుకుంటున్నవారే. నాలుగు నెలలుగా జీతాలందకపోవడంతో ఒక్కొక్కరికి దాదాపు రూ.నాలుగు లక్షలపైనే జీతం పెండింగ్‌లో ఉంది. ఈ జీతాలపై ఆధారపడి జీవించే కుటుంబాలకు నాలుగు నెలలుగా జీతాలు లేకపోతే పరిస్థితి ఏమిటో వేరే చెప్పనక్కర్లేదు. ఒకటి, రెండు నెలలు అయితే ఏదోరకంగా సర్దుకుంటారు. ఏకంగా నాలుగు నెలలు జీతాల్లేకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తమకు వచ్చే జీతాల ఆధారంగా నెలవారీ ఖర్చులు, ఇఎంఐలు వంటివి ఏర్పాటు చేసుకుంటారు. నాలుగు నెలలు వేతనాలందకపోవడంతో ఖర్చులు సర్దుబాటు చేసుకోవడం కష్టతరంగా మారింది. కుటుంబ అవసరాలకోసం సైతం అప్పుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్టోబర్‌నెలలోనైనా జీతాలు ఇస్తారా అనేది ఇంకా స్పష్టత లేదు. ఇప్పటి వరకూ వీరికి జీతాలు బిల్లుచేసే డిడిఒ ఎవరనేది కూడా ప్రభుత్వం తేల్చలేదు. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం డిఇఒ కార్యాలయంలో పనిచేసే ఎడిలకు డిడిఒ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఈ నెల జీతాలు బిల్లుపెట్టే సమయం దాటిపోయింది. దీంతో అక్టోబర్ నెలలోనైనా జీతాలందుతాయనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. అయితే అక్టోబర్ ఆరో తేదీ నుంచి పదోతేదీ మధ్యలో జీతాలకు సంబంధించి సప్లిమెంటరీ బిల్లులు పెట్టుకునే వెసులుబాటు ఉన్నట్లు చెబుతున్నారు. డిడిఒ బాధ్యతలను ప్రభుత్వం తేల్చడంతో వెంటనే ప్రభుత్వ బిల్లులు పెడతారా.. లేక మరింత ఆలస్యమవుతుందో తెలియడం లేదు. జిల్లాలో చాలా మండలాలకు రెగ్యులర్ ఎంఇఒలు లేరు. వేరే మండలాల్లో పనిచేస్తున్న ఎంఇఒలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు తమమండలంతోపాటు వేరే మండలంలోని బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారింది. రెగ్యులర్ ఎంఇఒలు లేని మండలాల్లో రెండో ఎంఇఒగా నియమితులైన ఉద్యోగులకు పనిభారం సైతం ఎక్కువగానే ఉంటుంది. అకాడమిక్‌కు సంబంధించిన ఇబ్బందుల పరిష్కారంలో ఎంఇఒ-2 ఉద్యోగుల పనితీరు బాగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ ఎంఇఒ-2 ఉద్యోగులకు నాలుగునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ విద్యాశాఖ నిర్లక్ష్యధోరణి అంశంగా మారింది. అక్టోబర్ నెలలో కూడా జీతాలు అందకపోతే ఉద్యోగులు ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది.

లబ్ధిదారులకు డెమో చెక్కును అందిస్తున్న కలెక్టర్

10,490 మందికి వాహన మిత్ర లబ్ధి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వైఎస్ఆర్ వాహనమిత్ర ఐదో విడత కింద 10,490 మందికి రూ.10.49 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సిఎం జగన్ విజయవాడలో పాల్గొన్న రాష్ట్రస్థాయి వైఎస్ఆర్.వాహనమిత్ర కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఉప రవాణా కమిషనరు ఎస్.శాంతకుమారి, ఆర్‌డిఒలు కె.శ్రీహరిరాజు, మదాని, లబ్ధిదారులైన పలువురు ఆటో డ్రైవర్లు వీక్షించి ముఖ్యమంత్రి సందేశాన్ని ఆలకించారు. అనంతరం జిల్లాకు సంబంధించి 10,490 మంది డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.10.49 కోట్ల డెమో చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు కె.విజయరాజు, టి.శివప్రసాద్, సహాయ ఎంవిఐలు పి.నరేంద్రబాబు, టి.కృష్ణవేణి, వి.ఎల్.ప్రవీణ, జి.స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్‌లు నడుపుతూ జీవించే వారికి వాహనమిత్ర ద్వారా ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేస్తున్నదని, 2019 నుంచి ఇప్పటివరకూ నాలుగుసార్లు ఈ సాయాన్ని లబ్ధిదారులకు అందజేయగా, ప్రస్తుతం ఐదోవిడత సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2019-20లో 17,101 మందికి రూ.17.10కోట్లు, 2020-21లో 19,521 మందికి రూ.19.52 కోట్లు, 2021-22లో 18,015 మందికి రూ.18 కోట్లు అందజేశారు. ఏలూరు జిల్లాలో 2022-23లో 10,303 మందికి రూ.10.30 కోట్లు ప్రభుత్వం అందజేసింది. ఐదో విడతగా 2023-24లో 10,490 మందికి రూ.10.49 కోట్లు శుక్రవారం విడుదల చేసిందన్నారు. ఉప రవాణా కమిషనరు ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ ఆటో, టాక్సీ క్యాబ్, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు, డ్రైవర్లకు వైఎస్ఆర్ వాహన మిత్ర అందిస్తుందని తెలిపారు. ఈ విడతలో మొబైల్ పంపిణీ వాహన యజమానులు (ఎమ్‌డియు), డ్రైవర్లకు కూడా రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ వాహనమిత్ర కింద లబ్ధిపొందే నియోజకవర్గంలో 1442 మందికి, దెందులూరు నియోజకవర్గంలో 1988 మందికి ఏలూరు నియోజకవర్గంలో 1596 మందికి, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 243 మందికి, కైకలూరు నియోజకవర్గంలో 1198 మందికి, నూజివీడు నియోజకవర్గంలో 1938 మందికి, పోలవరం నియోజకవర్గంలో 1286 మందికి, ఉంగుటూరు నియోజకవర్గంలో 799 మందికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం నాయకులు కెవిఎల్.కుమార్, నగరబోయిన లీలాకృష్ణ మాట్లాడుతూ వాహనమిత్ర కింద అందిస్తున్న రూ.10 వేలు వాహన ఇన్సూరెన్స్ కింద రూ. 8 వేలు, ఫిట్‌నెస్ కింద రూ. 2 వేలు, కట్టుకుని ధైర్యంగా వాహనాన్ని నడుపుకుంటున్నామన్నారు. కరోనా సమయంలో కూడా తమకు రూ.వెయ్యి ఆర్థిక సాయంకూడా ప్రభుత్వం అందించిందన్నారు. కెవిఎల్.కుమార్ మాట్లాడుతూ బి ఫార్మసీ చదువుకుంటున్న తమ కుమారుడికి నాలుగేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు, రైతులు, మహిళలు, విద్యార్థులు తదితరులకు ఎంతో తోడ్పాటునిస్తున్నాయన్నారు. అయితే భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమం ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి జగన్‌ని వారు కోరారు.

ఆరోగ్య సురక్ష జిల్లా ప్రత్యేకాధికారిగా శశిభూషణ్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి (ఎడమవైపు)

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించేందుకు జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమించిన రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకాధికారి శశిభూషణ్ కుమార్‌కు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణకు సంబంధించి ప్రణాళికను రూపొందించామన్నారు. ప్రవేశమార్గం నుంచి బోకెన్లు రిజిస్ట్రేషన్, స్క్రీనింగ్, వైద్యుల పరీక్షలు, మందుల పంపిణీ, క్రౌడ్ మేనేజ్ మెంట్, జగనన్న కంటివెలుగు శిబిరం, పౌష్టికాహార శిబిరం తదితరాలకు సంబంధించిన వివరాలపై ప్రత్యేకంగా రూపొందించిన మ్యాప్‌ను శశిభూషణ్ కుమార్‌కు చూపుతూ వాటి వివరాలను సమగ్రంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలియజేశారు. జిల్లాలో 14 అర్బన్ హెల్త్ కేంద్రాలతోపాటు 463 రూరల్ ఆరోగ్య కేంద్రాలతో కలిపి మొత్తం 477 కేంద్రాలకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రణాళికను రూపొందించామన్నారు. వీటిపర్యవేక్షణకు తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కూడిన 62 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 130 మంది మెడికల్ ఆఫీసర్లను, 463 కేంద్రాలకు సిహెచ్‌ఒలను మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జెఎఎస్ నిర్వహణకు 104కు సంబంధించి 41 వాహనాలను కేటాయించామన్నారు. జెఎఎస్ ఇంటింటి సర్వేలో 1861 మంది ఆశా వర్కర్లకు శిక్షణ అందించామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తొలి రోజైన ఈ నెల 30న శనివారం 25 గ్రామాల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ప్రత్యేకాధికారి శశిభూషణ్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు.

ఏలూరు నగర సుందరీకరణకు కార్యాచరణ

రూ. 20 లక్షలతో నిర్మించిన వాటర్ ఫాల్ ప్రారంభంలో ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరాన్ని సుందరీకరించడానికి తమవంతు కృషి చేస్తున్నట్లు మాజీ ఉపముఖ్యమంత్రి, స్థానిక శాసన సభ్యులు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ వద్ద రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్‌ఫాల్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి ఆళ్ల నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని ప్రభుత్వపరంగా సుందరీకరించనున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో కలెక్టర్ ప్రణాళిక ప్రకారం ఏలూరు నగరంలో సుందరీకరణ పనులు చేపట్టినందుకు కలెక్టర్‌ను అభినందనలు తెలిపారు. ఏలూరు నగర ప్రజల మానసిక వికాసానికి, ఉల్లాసానికి, ఆనందానికి వాటర్ ఫాల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే కాకుండా పేద ప్రజలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. పగలంతా కష్టపడి ఆ కష్టాన్ని మరచిపోవడానికి ఇలాంటి వాటర్ ఫాల్స్, పార్కులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.నాలుగు కోట్లతో ఏలూరు నగర అభివృద్ధి, రూ.ఆరు కోట్ల నిధులతో ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. వాటర్ ఫాల్ జెడ్‌పికి, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్నందున నగర ప్రజలే కాకుండా పొరుగు ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదాన్నిస్తుందన్నారు. నగర అభివృద్ధిలో మేయర్, మున్సిపల్ కమిషనర్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, 32వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బండారు సునీతా కిరణ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పోలీసులకు అండగా ఉంటా : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేసే పోలీసుల సమస్యలను తీర్చేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివాస్‌ను ఎస్‌పి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పోలీసులు, హోంగార్డులు తమ సమస్యలపై ఎస్‌పికి వినతిపత్రాలు సమర్పించారు. వాటని పరిశీలించి స్వయంగా సిబ్బందితో మాట్లాడిన ఎస్‌పి వారికి భరోసా కల్పించారు. సమస్యలు తక్షణం పరిష్కరించాలని సంబంధిత పోలీసు ప్రధాన కార్యాలయ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసులకు ఎలాంటి సమస్యలు లేనప్పుడే వాళ్ల విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలందించగలుగుతారని, అందుకే వారికి ఎలాంటి సమస్యలున్నా సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

జంగారెడ్డిగూడెం:పొగాకు బోర్డు అనుమతి మేరకే రైతులు పొగాకు పంటను సాగు చేయాలని రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య తెలిపారు. మండలంలోని మైసన్నగూడెంలో వర్జీనియా పొగాకు పంట నియంత్రణపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ 2022-2023 పంట కాలానికి రైతులకు లభించిన ధరలు వచ్చే పంటలకు లభిస్తాయని నమ్మకం లేదన్నారు. అందువల్ల పొగాకు బోర్డు అధికారుల సూచన మేరకు అనుమతి పొందిన విస్తీర్ణంలోనే వర్జీనియా పొగాకు పండించాలని సూచించారు. ఒకటో వేలం కేంద్రం, వేలం నిర్వహణ అధికారి బి.శ్రీహరి మాట్లాడుతూ అధిక పంట పండించి రైతులు నష్టపోవొద్దని సూచించారు. పంట నియంత్రణ నియమాలు పాటించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వీర మహేష్‌కు డాక్టరేట్

జంగారెడ్డిగూడెం:కృష్ణ విశ్వవిద్యాలయం, బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్ నుండి స్థానిక వీర మహేష్‌కు డాక్టరేట్ లభించింది. ఈ నెల 28వ తేదీ విశ్వవిద్యాలయంలో జరిగిన మౌఖిక పరీక్ష, అమ్మిట్‌లో మహేష్‌కు డాక్టరేట్ డిగ్రీని ప్రతిపాదించగా, గురువారం విశ్వవిద్యాలయం అధికారికంగా ప్రకటించిందని మహేష్ తెలిపారు. తరిగిపోతున్న పిచ్చుకల సంతతిని పెంపొందించడం కోసం జంగారెడ్డిగూడెం పట్టణంలో పదేళ్లుగా కృత్రిమ ఆవాసాలను మహేష్ ఏర్పరుస్తూ పర్యావరణానికి విశిష్ట సేవను అందిస్తున్నారు. ఇదే విషయంపై మచిలీపట్టణంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో 2019లో పిహెచ్ డి రిజిస్ట్రేషన్ చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం, బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ లంకా సుశీల పరిశోధనా మార్గదర్శకత్వాన్ని అందించారని ఆయన తెలిపారు. స్థానిక ప్రముఖులు పలువురు వీర మహేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న లింగరాజు

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని జి.రాజు డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ వచ్చేనెల ఆరో తేదీన జరగబోయే విజయవాడ ధర్నాలో పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఉపాధ్యక్షులు జి.రాజు విజ్ఞప్తిచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రవాణారంగం ద్వారా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సంపాదించి పెడుతున్న రవాణా రంగ కార్మికులకు ఎలాంటి రక్షణ కల్పించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రవాణారంగ చట్ట సవరణ రవాణారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎపి రాష్ట్రం ప్రయోగశాలగా మారిందని, ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా జిఒ 21 పేరుతో గ్రీన్ టాక్స్ రూ.20వేల వరకూ పెంచిందని, అనేక రూపాల్లో ఫైన్లు విధిస్తూ రవాణా రంగ కార్మికుల ఆదాయాన్ని కొల్లగొడుతోందని విమర్శించారు. 28వ తేదీ నుండి జరుగుతున్న జిల్లా ప్రచార యాత్రకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.గోపి అధ్యక్షత వహించి సభను ప్రారంభించారు. రాష్ట్రంలో దాదాపు 40 వేలమంది రవాణా రంగా కార్మికులుండగా వాహనమిత్ర పథకాన్ని కొద్దిమంది ఆటో ఓనర్లకు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి జి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల ఆరో తేదీన విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రవాణా రంగం ద్వారా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సంపాధించి పెడుతున్న కార్మికులకు రక్షణ కల్పించకపోవడం దారుణమన్నారు. కేరళ, తమిళనాడు తరహాలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి జి.రవీంద్రబాబు, వెంకటేశ్వరరావు, ఎస్.సూర్యకుమార్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో శనివారపు పేట విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రత్యూష

గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో శనివారపు పేట జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థిని ఎ.ప్రత్యూషకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతిని వచ్చేనెల రెండో తేదీన పెదనిండ్రకొలను గాంధీభవనంలో సర్వోదయ మండలి వారు బహుమతి ప్రధానం చేస్తారని కన్వీనర్ ప్రసాద్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

స్వామినాథన్‌కు పశ్చిమతో ఎనలేని అనుబంధం

ఉమ్మడి జిల్లాలో రెండు పర్యాయాలు పర్యటన - ధాన్యానికి మద్దతు ధర కల్పనకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం

స్వామినాథన్ సందర్శించిన మార్టేరు వరిపరిశోదనా సంస్థ ఇదే

ప్రజాశక్తి - భీమవరం(పశ్చిమగోదావరి)

హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణులు ఎంఎస్.స్వామినాథన్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో ఎనలేని అనుబంధం ముడిపడి ఉంది. ఆహార రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు, ఆకలిని, పేదరికాన్ని పారదోలేందుకు ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అధిక దిగుబడిని అందించే వరి, గోధుమ వంగడాలను అందించి దేశానికి ఎంతో మేలు చేకూర్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని, కష్టపడి చమటోడ్చి పంట పండించే రైతులకు కనీస మద్దతు ధర అందించాలనే దృఢ సంకల్పంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్య వహించారు. జిల్లాలో రెండు పర్యాయాలు పర్యటించి అనేక అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. 2007లో జిల్లాలో పర్యటించిన స్వామినాథన్ వ్యవసాయం, రైతుల కష్టాలు, శ్రమ, దిగుబడి, మద్దతు ధర వంటి అంశాలపై అధ్యయనం చేశారు. మూడేళ్ల తర్వాత మరొకమారు జిల్లాలో పర్యటించారు. ముఖ్యంగా ధరల నియమ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆయన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిలో భాగంగానే ఏర్పడిన స్వామినాథన్ కమిటీ సిఫార్సు రైతుల పోరాటాల్లో ఇప్పటికీ ఒక ముఖ్యమైన డిమాండ్‌గా ఉంది. రైతు కార్యచరణ సమితి అధికార ప్రతినిధి, కీర్తిశేషులు మంతెన సూర్యనారాయణ రాజు స్వామినాథన్‌కు అత్యంత సన్నిహితులు. ఇరువురూ కలిసి అప్పట్లో జిల్లాలో పర్యటించారు.

పెనుమంట్ర:ఎంఎస్.స్వామినాథన్ జిల్లాలోని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని 1967లో సందర్శించినట్లు ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి తెలిపారు. ఆయన మృతి బాధాకరమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో ఫిలిఫైన్స్ నుంచి టిఎన్-1, ఐఆర్-8ను భారతదేశంలో పరిచయం చేశారని తెలిపారు. పూర్వపు రోజుల్లో పొడుగు విత్తనాలకు బదులుగా పొట్టి విత్తనాలు పరిచయం చేశారని తెలిపారు. వాటిలో ప్రాముఖ్యత్యగల ఐఆర్-8ను ఆచంట రైతు నెక్కంటి సుబ్బారావు అభివృద్ధి చేసిన సందర్భంగా పంట దిగుబడి చూసిన సందర్భంలో మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానానికి స్వామినాథన్ వచ్చారని తెలిపారు. అదే లక్ష్యంతో చేసిన ప్రస్తుత ఎంటియు 1271 రకం 130 రోజుల నుంచి 140 రోజుల్లో పంట చేతికి వస్తుందని తెలిపారు. సుడిదోమను తట్టుకుంటుందని చెప్పారు. అలాగే ఎంటియు 1275 రకం 2023లో సెంట్రల్ రిలీజింగ్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారన్నారు. దీన్ని ఎంటియు 1075, 1081, 1121 సంక్రమణ చేసి తయారుచేసిందన్నారు. ఈ విత్తనాన్ని తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి వంటి రాష్ట్రాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ విత్తనం అగ్గి తెగులు, మెడవిరుపు, ఆకు నల్లి వంటి తెగుళ్లను తట్టుకుంటుందని తెలిపారు.

తాడేపల్లిగూడెం : ఎంఎస్.స్వామినాథన్ శాస్త్రవేత్తలకు, యువతకు ఆదర్శప్రాయులని డాక్టర్ వైఎస్ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ తెలిపారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ గతేడాది వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన బిపి పాయ్‌రోజ్ గార్డెన్‌ను ఆన్‌లైన్‌లో స్వామినాథన్ ప్రారంభించారన్నారు. తన పరిశోధనా పుస్తకం 'టఫ్ గ్రాస్సెస్'కి స్వామినాథన్ ముందుమాట రాశారని జానకీరామ్ తెలిపారు. స్వామినాథన్ సంతాప సభ వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జానకీరామ్, విశ్వవిద్యాలయ అధికారులు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు ఎల్.నారం నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ స్వామి, విశ్వవిద్యాలయ విద్యార్థుల వ్యవహారాల డీన్ సలోమిసునీత, ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఇతర విశ్వ విద్యాలయ అధికారులు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి, ఉద్యాన కళాశాల ఆచార్యులు ఇమ్మానియేల్, రమాదేవి, ఉమాకృష్ణ, దివ్య, పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎస్‌సి రెండో సంవత్సరం చదువుతున్న ఉద్యాన కళాశాల విద్యార్థి ఎస్.ఉజ్వల్ మనోజ్ 'దివికేగిన వడ్లగింజ' అంటూ స్వామినాథన్ ఔన్నత్యాన్ని, అద్భుతమైన పరిశోధనా ఫలాలను కీర్తిస్తూ రాసిన కవిత అందరి హృదయాలను ఆకట్టుకుంది.



స్వామినాథన్‌కు తన పరిశోధన పుస్తకం బహూకరించిన ఉప కులపతి జానికీరామ్(ఫైల్)

ఏలూరు అర్బన్ : అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయరంగానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంతాపం తెలిపారు. ఆహార భద్రతను సాధించడానికి విశేషంగా కృషిచేసిన గొప్పదార్శనికుడని కొనియాడారు. ఆహారధాన్యాలలో మన దేశానికి స్వావలంబనను అందించిన హరిత విప్లవ పితామహుడన్నారు. వ్యవసాయరంగంలో పరిశోధనలకు మార్గదర్శకత్వం వహించి అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ వంటి ప్రతిష్టాత్మక బిరుదును పొందారన్నారు. 1987లో వ్యవసాయ పరిశోధనల్లో అత్యున్నత పురస్కారం ప్రపంచ ఫుడ్ అవార్డు ఆయనను వరించిందన్నారు. ఆహార ఉత్పత్తిలో స్వయం సవమృద్ధి సాధనకు స్వామినాథన్ విశేష కృషి చేశారని, స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా దేశంలో వ్యవసాయాభివృద్ధికి ప్రపంచస్థాయి పరిశోధనల వారసత్వాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. మానవాళికి సురక్షితమైన ఆకలి లేని భవిష్యత్తు దిశగా ప్రపంచాన్ని నడిపించడానికి ఆయన చూపిన మార్గం ప్రశంసనీయమన్నారు. జాతీయ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన చేసిన కృషి అఖిల భారత రైతాంగాన్ని కదిలించిందన్నారు. జాతీయస్థాయిలో వివిధ భావాలు కలిగిన రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించి ఉద్యమానికి ఆయన ప్రేరణగా నిలిచారని కొనియాడారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏలూరు అర్బన్ : హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణులు, స్వామినాథన్ మృతికి ఎపి గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపింది. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగంలో దేశానికి విశేష సేవలందించారని, ఆహారరంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఆకలిని, పేదరికాన్ని పారదోలడానికి ఆయన ఎన్నో పరిశోధనలు చేసి అధిక దిగుబడి ఇచ్చే అనేక రకాల వంగడాలను రైతాంగానికి అందించారని, రైతుల పక్షాన నిలిచిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్ అని కొనియాడారు.

ముదినేపల్లిలో కుండపోత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. మండల కేంద్రమైన ముదినేపల్లితో పాటు మండలంలోని సింగరాయపాలెం, శ్రీహరిపురం, కోమర్రు, చేవూరు, కాకరవాడ, కొరగంటపాలెం, బొమ్మినంపాడు, కొత్తపల్లి, వాడవల్లి, వైవాక, వడాలి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో రహదారులు, గ్రామాల్లోనే అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో పలు గ్రామాల్లో ఉన్న పల్లపు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి పల్లపు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం రాకతో వ్యవసాయ కూలీలు మధ్యలోనే పనులు నిలుపుదల చేసి ఇళ్లకు చేరుకున్నారు. వర్షంతో చిరు వ్యాపారులకు బేరాలు లేకుండా పోయాయి. ఈ వర్షం ఖరీఫ్, వరి సాగుకు ఈ సమయంలో మంచి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రెండు గంటల పాటు కురిసిన ఈ భారీ వర్షం సార్వా వరి చేలకు జీవం పోసినట్లైందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పలు మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 30వ తేదీ శనివారం కొయ్యలగూడెం మండలం బయ్యనగుడెంలో ఉదయం 9 నిర్వహిస్తున్నామని మండల పరిషత్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు హాజరవుతున్నట్లు ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఉంగుటూరు : జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న ఉంగుటూరు మండలంలో ప్రథమంగా వెల్లమిల్లి-1 సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు తెలిపారు. గ్రామ వాలంటీర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటా సర్వే చేయగా 330 మంది వివిధ వ్యాధులతో నమోదు చేసుకున్నారని, వారిందరికి టోకెన్లు ఇచ్చామని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ వెల్లడించారు.

బెస్తావీధిలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

గణపతి నవరాత్రుల మహోత్సవం ముగింపు సందర్భంగా బెస్తావీధి చిన రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధనను నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా విశేష పూజలందుకున్న లంబోదరునికి, వివిధ రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. ఈ అన్నసమారాధనకు మండలంలోని వేలాది మంది భక్తులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బెస్తా వీధి చిన రామాలయం కమిటీ సభ్యులు పాయల వీర వెంకట సత్యనారాయణ, దాసరి సురేష్, రామేశ్వరపు వెంకటేశ్వరరావు, కడలి నాగభూషణం, షేక్ సాయిబాబు, షేక్ యాబు, ఎస్.శ్రీనివాస్, తుమ్మల కాంతారావు, నోముల ప్రవీణ్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఉద్యోగం, వ్యాపారాల పట్ల ఆసక్తి చూపించాలని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు తెలిపారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో గురువారం 'ఎవ్రీ డే టీ కార్నర్' షాపుని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అండగా, సమాజంలో మంచి పరివర్తన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవినాష్, బతేజ, మోషే పాల్గొన్నారు.

పోటీల నిర్వహణ ఆనందదాయకం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి సేవా సమితి ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించడం చాలా ఆనందదాయకమని బాలవికాస్ విద్యవాహిని రాష్ట్ర ట్రైనర్ బసవరాజు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 126 మంది విద్యార్థినులకు ఆచార్య దేవో భవ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినులకు గోల్డ్ మెడల్ బహుమతి ప్రధానం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు, రామునాయుక్, శివ నాగమల్లేశ్వరి, యువరాజు, ముసునూరు శ్రీవెంకటేశ్వర సొసైటీ సెక్రటరీ లక్ష్మణరావులు పాల్గొన్నారు.

నాగేంద్రనాథ్‌కు ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - కలిదిండి

మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి భర్త, రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యేర్నేని నాగేంద్రనాథ్(78) మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొండూరు గ్రామంలోని ఆయన భౌతికాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, సిపిఎం కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు అర్‌సిపి రెడ్డి, రైతు సంఘం నాయకులు నీలం మురళీకృష్ణా రెడ్డి, మాజీ ఐఎఎస్ అధికారి జెడి లక్ష్మి నారాయణ, అగ్రికల్చర్ మిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంఐఎస్ నాగిరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

విదేశీ విద్యకు సన్నద్ధతపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు శుక్రవారం 'ఫేస్ ది గ్లోబల్ కాంపిటీషన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అండ్ స్టడీ అబ్రాడ్' అనే అంశాలపై యూఎస్‌ఎకు చెందిన రాయదాస్ మంతెన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశాల్లో చదువుకోవాలనుకుంటున్న వారు ఏ విధంగా సన్నద్ధులు కావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ప్రదీప్ కుమార్, ఎఫ్ఒ నాగార్జున దేవి, డీన్ అకాడమిక్స్ బి.లక్ష్మణరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఎస్‌వి.వెంకటరావు, వాసిరెడ్డి స్రవంతి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వినాయక చవితి ఉత్సవాల్లో అపశృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో అపశృతి నెలకొంది. గురువారం ఉత్సవ మండపం వద్ద హారతి ఇస్తుండగా మండపానికి నిప్పు అంటుకుంది. దీంతో ఉత్సవమండపం విగ్రహంతో సహా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బొప్పాయి కోసం ఘర్షణ : ఇద్దరికి గాయాలు

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నివసిస్తున్న పద్మ, సాంబశివరావు మధ్య బొప్పాయి పండు వివాదంలో ఇద్దరికీ గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పద్మ, సాంబశివరావు ఇంటి మధ్యన బొప్పాయి చెట్టు ఉంది. బొప్పాయి పండు కోసుకునే క్రమంలో చెట్టు నాదంటే నాదని ఇరువురు వాగ్వాదం చేసుకొని ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఇరువురికి తీవ్ర గాయాలు అవటంతో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నూజివీడు రూరల్: పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో పోతు రెడ్డిపల్లి అడ్డరోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పొలసానిపల్లికి చెందిన రామకృష్ణ(32) ద్విచక్ర వాహనంపై పోతిరెడ్డిపల్లి వెళుతుండగా అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాను ఢీకొని యువకుడు దుర్మరణం

నూజివీడు రూరల్: మండలంలోని తుక్కులూరు గ్రామానికి చెందిన లంక కిషోర్(28) బైకుపై హనుమాన్ జంక్షన్ నుంచి శుక్రవారం నూజివీడు వస్తుండగా మోరసపూడి గ్రామం వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న వ్యాను ఢీ కొట్టడంతో కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొయ్యలగూడెంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ నాలుగో తేదీన రాజమండ్రిలో నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్త సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శుక్లబోయిన రాంబాబు ఇంటి వద్ద సదస్సు పోస్టర్లను మండల కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన లింగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ప్రధానంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగాలు మినహాయించి ఇంక ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు లక్షలపైనే ఉద్యోగాలు ఉన్నాయని, అవి ఇప్పటిదాకా భర్తీ చేయలేదన్నారు. టీచర్లకు సంబంధించి డిఎస్‌సి పోస్టులు ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకురాలు మోడియం నాగమణి, అందుగుల ప్రభాకర్, ఆకుల దుర్గారావు, కె.సీతారాములు, సిహెచ్ మరిడియా, గోపి, ఎస్.శివకుమార్, బొబ్బర మంగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : రాష్ట్రంలో నిరుద్యోగ యువత రోజురోజుకు పెరుగుతోంది, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేదంటే రాబోయే రోజుల్లో నిరుద్యోగంపై మరిన్ని పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం నిర్వహిస్తున్న ఈ సదస్సు పిలుపునిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో యువతకు అండగా నిలబడేందుకు అక్టోబర్ 4వ తేదీన రాజమండ్రిలో విద్యావేత్తలు, మేధావులతో కలిసి సిపిఎం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తోందని, ఈ సదస్సులో సిపిఎం ఒక ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రకటించనుందన్నారు. కావున యువతతో పాటు విద్యార్థులు, మేధావులు, వివిధ ప్రజాసంఘాలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.పృథ్వీ రాజ్, కె.నవీన్, మహేష్, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

ముసునూరులో మోకాళ్లపై టిడిపి నేతలు నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని టిడిపి ఆధ్వర్యంలో నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఘంటా మురళీ రామకృష్ణ, జగ్గవరపు ముత్తారెడ్డిలు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును టిడిపి శ్రేణులే కాకుండా వైసిపిలోని కొందరు కూడా తప్పుపడుతున్నారని, ఇది వైసిపి పతనానికి నాంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంటా సుధీర్ బాబు, బొమ్మాజి అనిల్, మేకా ఈశ్వరయ్య, బోడా అనీష్ కుమార్, పల్లి శ్రీను, బలుసు సాయి, బొబ్బిలి డాన్ దివాకర్, మండల టిడిపి అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, సాయల సత్యనారాయణ, అభిమానులు పాల్గొన్నారు.

యర్రంపల్లి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని చింతలపూడి మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ నాయకుడిని వెంటనే విడుదల చేయాలని గ్రామస్తులు తెలుపుతూ, కరపత్రాలను వివరిస్తూ, గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కామవరపుకోట : టిడిపి ఆధ్వర్యంలో పంచాయతీలోని కొమ్ముగూడెం, కొండగూడెం గ్రామంలోని నాయకులపేట కాలనీలో బాబుతో నేను అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మీద అక్రమ అరెస్టు గురించి వివరించి 92 61292612 నెంబర్‌కు మి సిడ్ కాల్ ఇచ్చారు. చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ వజీర్ ఖాన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి డాన్ దివాకర్, యూనిట్ ఇన్‌ఛార్జి గంటా గోపి, పరస శ్రీను, అంకెం రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరులోని మండపం సెంటర్ వద్ద మోకాళ్ల పై టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు గద్దే రఘుబాబు, కందుల పిచ్చియ్య, మల్లిబాబు, కాటేపల్లి ప్రసాద్, గార్లపాటి నరసింహారరావు, పాకనాటి సీతారామ్, రాపర్ల ప్రతాప్, గద్దల మోహనరావు, రాపర్ల బాలకృష్ణ, పుల్లిబళ్ల సత్యనారాయణ, సూర్యదేవర శ్రీనివాసరావు, మెదరమెట్ల సురేంద్ర, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారామ్, లక్కపాము కాంతారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. టి.నరసాపురంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ బాబుతో నేను కరపత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, మాజీ జడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతి రావు పాల్గొన్నారు.

బాల్యం నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి

చింతలపూడిలో బాలికల ఉన్నత పాఠశాలలో..

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాల్యం నుంచే విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి తెలిపారు. మండలంలోని బండివారిగూడెం ఎంపియుపి, స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాజీ, ఆర్‌విజి కృష్ణారావు, కెవి.నారాయణ, కె.కుటుంబరావు, ఎండి.రహమ్ తుల్లా, జె.నెహ్రూ పాల్గొన్నారు.

పోలవరం : మేరీ మాటి మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గూటాలలో వివిధ రకాల కార్యక్రమాలు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు కెవి రాఘవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కమిటీ మెంబర్లు, గ్రామస్తులు, గ్రామంలోని మట్టిని ఆ కలశంలోకి సేకరించారు.

ఉంగుటూరు : ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్, గ్రామ సర్పంచి నేదూరి వీర వెంకట మోహన్ రావు, వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శ్రావణ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ జాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు సుబ్బలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో హెడ్ మాస్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీలుగుమిల్లి : విద్యార్థులు స్వాతంత్ర పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 బుచ్చయ్య, హెచ్‌ఎం చంద్రావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడారు.

చింతలపూడి : ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాల చింతలపూడిలో మేరీ మాటి-మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం మాటూరి చక్రధర్ రావు అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులు మట్టితో కలశం రూపొందించి, వివిధ జాతీయ నాయకుల పటాలతో ర్యాలీ నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని లక్కవరం జడ్‌పిహెచ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మేరా మట్టి - మేర దేశ్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం జె.లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది లక్కవరం ప్రధాన రహదారులలో ర్యాలీ చేపట్టారు.

66 మంది యువకుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సేవా పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు విజన్ లైన్స్‌క్లబ్ సహకారంతో స్థానిక ఆర్‌ఆర్ పేటలోని గ్రావిటీ జిమ్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 66 మంది యువకులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వలన ఆ రక్తాన్ని కాంపోనెంట్లుగా విభజించి, ముగ్గురు ప్రాణాలను కాపాడగలుగుతామని తెలిపారు. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా ఇతరులకు సహాయం చేయగలిగే గొప్ప ఆస్తి రక్తమేనన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడానికి సహకరించిన ఏలూరు విజన్ లైన్స్‌క్లబ్, గ్రావిటీ జిమ్ సెంటర్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్ కె.వర ప్రసాదరావు, ఏలూరు విజన్ లైన్స్‌క్లబ్ రీజియన్ ఛైర్ పర్సన్ ఎ.శేషుకుమార్ పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ముసునూరు: తమ పొలంలో పండించే ప్రతి పంటకు ఇ-క్రాప్ నమోదు చేయించుకుని ఇకెవైసి చేయించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలో ఎడి ఎస్.మధుమోహన్, తహశీల్దార్ దాసరి సుధల ఆధ్వర్యంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి పంటకు తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రైతు సంక్షేమానికి కృషి

టి.నరసాపురం: రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ దాసరి రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక సొసైటీ ఆవరణలో ఛైర్‌పర్సన్ రాంబాబు అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సౌకర్యార్థం తిరుమలదేవిపేటలో 500 మెట్రిక్ టన్నుల గోదాము నిర్మించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సిఇఒ జి.బుజంగ రావు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో పర్సన్లు వరికూటి సత్యనారాయణ, పిఎస్ఎన్ వి.సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ

టి.నరసాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహనుండాలి

ఏలూరు అర్బన్: విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన కలిగి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హేలాపురి లయన్స్ క్లబ్ ఏలూరు వారి ఆధ్వర్యంలో 'యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కూన కృష్ణారావు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ఆధారంగా జరుగుతున్న సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కెబిరావు, వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం

చాట్రాయి: రాష్ట్రంలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందాలన్నదే సిఎం జగన్ ఆశయమని ఎపి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం చాట్రాయి మండలాభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి లంక నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో అవినీతి లేకుండా నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మురళీమోహన్, ఇఒపిఆర్‌డి పి.మురళీకృష్ణ, గ్రామ సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మద్ది ఆలయానికి రూ.38.24 లక్షల ఆదాయం

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయి గూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీల లెక్కింపులో ఆదాయం రూ.38,24,102లు సమకూరిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఆలయ ఉండి లెక్కింపును తనిఖీదారు ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షణలో కెవిబి బ్యాంక్ సిబ్బంది హుండీలను తెరచి లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగానమ్మ, దసరా మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం : స్థానిక గ్రామ దేవత గంగానమ్మ జాతర, దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అర్చకులు అనిశెట్టి పెద్దింటిచార్యులు తెలిపారు. శుక్రవారం దసరా ఉత్సవాల నేపథ్యంలో గంగానమ్మ దసరా మహోత్సవ కరపత్రాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి చార్యులు మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు గంగానమ్మ దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : ఏలూరు

ఇ.పి.నెం.216/2010
ఓ.ఎస్.నెం.56/2005

శ్రీమతి బొప్పన వాణి ...డి.హెచ్.ఆర్
మరియు
శ్రీమతి కాకరాల రంగనాయకమ్మ వగైరా ...జె.డి.ఆర్స్

పై నంబరు ఇ.పి.గ్రంధములో డిక్రీ ప్రకారము డి.హెచ్.ఆర్.కు రావలసిన బాకీ రాబట్టుటకు, ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిలోని జె.డి.ఆర్స్ తాలూకు 3/4వ వంతు వాటాను ది.21-09-2023వ తేదీని పై కోర్టులో వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు పై కోర్టు వారి ఎదుట **ది.20-10-2023వ తేదీని ఉదయం గం 10:30 ని॥లకు హజరై వేలంలో పాల్గొనవచ్చును.**

వేలం వేయబడు ఆస్తి వివరం

పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, వెంకటాపురం పంచాయితీ, శివనగర్, కొత్తూరు రోడ్డులోని 550 చ॥గ॥లు అందులోని డోరు నెం.13/36రు పాత ఎసెస్మెంట్ నెం. 112152 గల యిల్లు మరియు కరెంటు కనెక్షనుతో సహా ఆస్తికి హద్దులు: **తూర్పు:** సంపంగి బుజ్జయ్య గారి యిల్లు. **దక్షిణం:** రోడ్డు. **పడమర:** రోడ్డు. **ఉత్తరం:** ఆర్నేపల్లి రంగారావు గారి యిల్లు. పై హద్దుల మధ్య గల 550 చ.గ.లు స్థలం అందులోని యిల్లులో జె.డి.ఆర్స్. తాలూకు 3/4వ వంతు వాటా ఆస్తి.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.2,50,000/-లు
అమీనా విలువ : రూ.10,25,000/-లు
వేలం తేది : 20-10-2023

ఎస్.వి.ఆర్.గాంధీ
ఏలూరు, 29-9-23. డి. హెచ్.ఆర్.తరపు న్యాయవాది ఏలూరు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు, ప॥గో॥జిల్లా

ఇ.పి. నెం. 89/2015 ఇన్ ఓ.ఎస్. నెం. 367/2008

మధ్య:
శ్రీ బలే రామకృష్ణ ...DHr/DHr
మరియు
శ్రీ బలే గంగాధరరావు (డైడ్) మరియు యితరులు ...JDRs/ JDRs

పై నెంబరు గ్రంధములో DHr తన బాకీని పై JDR లు వద్ద నుంచి వసూలు చేసుకొనే నిమిత్తం దాఖలు చేసిన ఈ ఇ.పి. గ్రంధములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 13-10-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగంగా వేలం వేయబడును. వేలంలో పాడుకొనదలచినవారు ఉదయం గం॥ 10.30 ని॥లకు మీ ఆధార్ కార్డులతో వచ్చి షరతుల ననుసరించి వేలంలో పాల్గొనవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు, భీమడోలు మండలం, ఆగడాలలంక గ్రామం 1వ వార్డులో ఆర్.ఎస్. నెం. 1117/2రు దాఖలా పాత డోరు నెం. 1-5-7 నకు ప్రస్తుత డోరు నెం. 2-12 గల య. 0-09ట్లు ఆస్తిలో య. 0-03ట్లు ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** పంచాయతి రోడ్డు. **దక్షిణం:** JDR ల యొక్క మిగతా స్థలంలో గల పెంకుటిల్లు డోరు నెం. 2-12 (పాత డోరు నెం. 1-5-7). **పడమర:** రోడ్డు (గుండుగొలను టు చెట్టున్నపాడు). **ఉత్తరం:** కంసాల ధనాచార్యులు గారి వారసుల ఇల్లు మరియు స్థలం.

DHr Value : Rs. 2,50,000/-
JDR Value : పేర్కొనబడలేదు.
Amin Value : Rs. 2,00,000/- (తొమ్మిది సెంట్లు ఆస్తికి దానిని అనుసరించి దామాషాగా రూ. 1,33,333/-)

నోట్:
1. షెడ్యూలు ఆస్తి మీద ఎట్టి ఎన్‌కమ్‌బెరెన్సులు లేవు.
2. వేలంలో ఆస్తిని కొనుగోలు చేయు ఆసామి వేలం అయిన వెంటనే నాల్గవ వంతు వేలపు సొమ్ము మరియు ఫౌండేజ్ ఫీజు చెల్లించవలయును.
3. మిగులు వేలపు సొమ్ము రిజిస్ట్రేషన్ ఖర్చులతో సహా సదరు వేలం తేదీ లగాయితు 15 రోజులలో చెల్లించవలయును.
4. వేలం నియమ నిబంధనలు తెలుసుకొనుటకు పై కోర్టు ఆఫీసు నందు గాని, సెంట్రల్ నజారత్ ఆఫీసు నందు గాని సంప్రదించవలయును.

(కోర్టు వారి ఉత్తర్వులననుసరించి ప్రకటన జారీ చేయడమైనది)

KURAPATI PRITHVI RAJ
ఏలూరు Advocate, Eluru
తేది:29-9-2023 Cell: 8019826216

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 594/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Arepalli Udaya Lakshmi another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) ఆరేపల్లి ఉదయ లక్ష్మీ, భర్త: కృష్ణ రామ్మోహనరావు, హిందువు, స్త్రీ, 55 సం॥లు, డో.నెం. 25-6/1బి, గగ్గిపర్రు గ్రామం, యలమంచిలి మండలం.
2) వేముల వెంకటలక్ష్మీ, భర్త: వర్ధనరావు, హిందువు, స్త్రీ, 50 సం॥లు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.03-10-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMA DEVI
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 189/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Pajjuri Himabindu another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) పజ్జూరి హిమ బిందు, భర్త: వెంకటేశ్వరరావు, హిందువు, స్త్రీ, 35 సం॥లు, డో.నెం. 22-5-12, బి.సి. చెర్వు గట్ట, పాలకొల్లు.
2) వేముల సత్యవతి, భర్త: ప్రసాద్, హిందువు, స్త్రీ, 50 సం॥లు, గగ్గిపర్రు గ్రామం, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.03-10-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMA DEVI
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 348/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Veligatla Venkata Lakshmi another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) వెలిగట్ల వెంకట లక్ష్మీ, భర్త: ప్రసాద్, హిందువు, స్త్రీ, 38 సం॥లు, గగ్గిపర్రు గ్రామం, యలమంచిలి మండలం.
2) పితాని సత్యనారాయణ, తండ్రి: గాంధి, హిందువు, పురుషుడు, 42 సం॥లు, కాజాపడమర గ్రామం, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.05-10-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 363/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Midde Bhanumathi another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) మిద్దే భానుమతి, భర్త: నాగేంద్ర ప్రసాద్, హిందువు, స్త్రీ, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం.
2) కట్టా పద్మావతి, భర్త: వెంకటేశ్వరరావు, హిందువు, స్త్రీ, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.06-10-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku.

In The Court Of The 1st Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 352/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Borra Geetarani another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) బొర్రా గీతారాణి, భర్త: ప్రకాశరావు, హిందువు, స్త్రీ, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం.
2) జ్యోతి లక్ష్మీ, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.05-10-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku.